రాబడి

ఈటీఎఫ్‌లంటే ఏంటో తెలుసా?

- ఈటీఎఫ్‌లు ఈక్విటీ, డెట్, కమోడిటీస్ వంటి వివిధ రకాల సాధనాల కోసం అందుబాటులో ఉంటాయి.
- సాధారణంగా వీటికయ్యే వ్యయభారం తక్కువే. అయితే ఈటీఎఫ్‌ల క్రయవిక్రయాల్లో బ్రోకరేజీ ఫీజులు, ఇతరత్రా ట్రేడింగ్ ఖర్చులు తప్పవు.
- ట్రేడింగ్ జరిగే రోజున ఈటీఎఫ్‌లను నాటి మార్కెట్ ధరల వద్దే కొనవచ్చు.. అమ్మవచ్చు.
- ఒక సూచీ ప్రదర్శనను ప్రతిబింబించడమే ఈ ఈటీఎఫ్‌ల లక్ష్యం.
- మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే దేశంలో అందుబాటులో ఉన్న ఈటీఎఫ్‌లు పరిమితం.
- ఆన్‌లైన్ బ్రోకర్లు, సంప్రదాయ బ్రోకర్-డీలర్ల ద్వారా ట్రేడ్ అవుతాయి.
- ఇండివీడ్యువల్స్ తమ రిటైర్మెంట్ ఖాతాల్లోనూ వీటిని కొనవచ్చు.

లాభాల స్వీకరణకు అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. మదుపరులు కొనుగోళ్ల జోష్‌లో ఉన్నారు. ఫలితంగానే గత వారం సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు లేదా 1.57 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 82,365.77 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 412.75 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి తొలిసారి 25,235.90 దగ్గర ముగిసింది. కాగా, మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసే వీలుందని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వారం కరెక్షన్‌కు అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,850 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,500-25,700 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



ఇలా.. ప్లాన్ చేసుకోండి

సీనియర్ సిటిజన్ల పెట్టుబడికున్న 10 అత్యుత్తమ మార్గాలివే

ఆర్థిక ప్రణాళికలో పొదుపు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అవగాహన, వివేకంతో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో రాబడులను పొందవచ్చు. ఇక సాధారణ సిటిజన్స్‌తో చూస్తే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న 10 అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

1 సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం

పదవీ విరమణ పొందినవారు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల గురించే ఆరా తీస్తూ ఉంటారు. సురక్షిత, స్థిరమైన ఆదాయ వనరును కోరుకుంటారు. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్) ఒకటి. ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. ప్రతీ 3 నెలలకోసారి సవరిస్తారు. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. ఈ స్కీం గరిష్ఠ పరిమితి 5 ఏండ్లు. ఈ పెట్టుబడి మొత్తాలు పన్ను పరిధిలోకి రావు. అయితే వీటిపై పొందే వడ్డీ ఆదాయం వారివారి ఐటీ స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

2 పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం

తపాలా శాఖ అందించే ఈ స్కీంలో పెట్టుబడుల కుగాను నెలనెలా నిర్ణీత స్థాయిలో వడ్డీ ఆదాయాన్ని పొందవచ్చు. రిటైర్మెంట్ వయసులో ఆర్థిక భద్రతకు చక్కని అవకాశం. అయితే సీనియర్ సిటిజన్లకే కాదు.. 10 ఏండ్లు దాటిన భారతీయ పౌరులెవరైనా ఇందులో పెట్టుబడులకు దిగవచ్చు. దీని వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. ప్రతీ 3 నెలలకోసారి మారడానికి ఆస్కారం ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. ఆ తర్వాత మరో 5 ఏండ్లు కూడా పొడిగించుకోవచ్చు. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి.

3 ఫిక్స్‌డ్ డిపాజిట్లు

రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ) ఇవి. బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అలాగే నెలవారీగా, 3 నెలలవారీగా, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు. మార్కెట్ రిస్కులకు దూరంగా ఉంటూ సురక్షితమైన పెట్టుబడులను, స్థిరమైన ఆదాయాన్ని ఆశించేవారు ఈ ఎఫ్‌డీలను పరిశీలించవచ్చు.

4 సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. నెలనెలా మనం చేసే ప్రతీ డిపాజిట్‌ను ఓ ఎఫ్‌డీగానే చూస్తారు. తక్కువలో తక్కువగా రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ స్కీం. వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.

5 నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం. పదవీ విరమణ కాలంలో స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులకు ఇది చక్కని పథకమనే చెప్పవచ్చు. ఉద్యోగుల నుంచి, వారి సంస్థల తరపు నుంచి ఇందులోకి నగదు జమవుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద పన్ను ప్రయోజనాలు దక్కుతాయి.

9 మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్ రిస్కులకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది. నిజానికి రిస్కులకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఇవి పనికిరావు. ఈక్విటీ, రుణ మార్కెట్లలో మీ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు కారణం. అయితే ధైర్యంతో నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ఆకర్షణీయ రాబడులనే అందిస్తాయని చెప్పవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌కూ కొంత భాగం ఇవ్వవచ్చు. లాభాలపై మూలధన లాభాల పన్నులుంటాయి.

సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం

60 ఏండ్లు, ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి వచ్చినదే ఈ సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం. బ్యాంకులను బట్టి డిపాజిట్లకున్న కనీస, గరిష్ఠ పరిమితులు ఆధారపడి ఉంటాయి. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లదాకా ఉంటుంది. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎఫ్‌డీల తనఖాపై రుణాలనూ పొందవచ్చు. మీ డిపాజిట్లపై రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. రూ.50వేలదాకా పన్ను మినహాయింపుంటుంది.

6

7 ట్యాక్స్ ఫ్రీ బాండ్లు

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరపున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

8 ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్ఎస్ఎస్) అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు లేదా వాటి సంబంధిత సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. అయితే ఇందులో రిస్క్ ఉంటుందన్న విషయం మరువద్దు. అయినప్పటికీ వేచిచూస్తే పెట్టుబడులపై మంచి ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు మరి. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.

10 పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.

బసవన్నల పండుగ

నేడు ఎడ్ల పొలాల అమావాస్య

ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు చేసుకున్న రైతులు



గాంధారి/సుభాష్‌నగర్, సెప్టెంబర్ 1: వ్యవసాయంలోని ప్రతి పనిలో రైతన్నకు చేదోడు, వాదోడుగా ఉండే బసవన్నలకు (ఎద్దులు), రైతులకు విడదీయరాని బంధం ఉంది. పంట చేనులో దుక్కి దున్ని, విత్తనం నాటిన నుంచి, పంటను పండించి, నూర్పిడి చేసి ధాన్యాన్ని ఇంటికి తెచ్చేంత వరకు ప్రతిపనిలో రైతులకు ఎద్దులు ఏదో ఒక రకంగా సహాయపడుతూ ఉంటాయి.భూమిని నమ్ముకొని బతుకుతున్న రైతులు, వ్యవసాయ పనుల్లో తమకు సహాయపడుతున్న బసవన్నలను ఎంతో ప్రేమగా చేసుకోవడంతో పాటు, దైవ స్వరూపంగా భావిస్తారు. తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం ఎడ్ల పొలాల అమావాస్య వచ్చిందటే చాలు అన్నదాతల ఇండ్లల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. ఎడ్ల పొలాల అమావాస్య రోజున, రైతులు ఎద్దులను భక్తితో పూజిస్తారు. పండుగను పురస్కరించుకొని ఎద్దులకు శుభ్రంగా స్నానాలు చేయించి, రంగులను అద్ది, అందంగా మస్తాబు చేస్తారు. అనంతరం బసవన్నలకు పిండి వంటలతో పాటు, ఉలువలు, బెబ్బర్లతో చేసిన గుడాలను, బెల్లాన్ని తినిపిస్తారు. ఈ పండుగ రోజున ఎద్దులతో ఎలాంటి వ్యవసాయ పనులను చేయించరు. నేడు (సోమవారం) ఎడ్ల పొలాల అమావాస్య కావడంతో పండుగను ఘనంగా జరుపుకోవడానికి ఉమ్మడి జిల్లాలోని రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

దైవంగా భావిస్తారు..

వ్యవసాయ పనుల్లో సాయం చేసే బసవన్నలను రైతులు దైవంగా భావిస్తారు. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం ముగింపు అమావాస్య రోజున రైతన్నలు ఎడ్ల పొలాల అమావాస్యను ఘనంగా జరుపుకుంటారు. ఈ పండుగనే ఎడ్ల పొలాల అమావాస్య అని, పొలాల అమావాస్య పిలుస్తారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, మహారాష్ట్రలోని పలు జిల్లాల్లో వ్యవసాయదారులు జరుపుకునే పెద్ద పండుగల్లో ఎడ్ల పొలాల అమావాస్య ముఖ్యమైనది. మహారాష్ట్ర సంస్కృతిని స్ఫూర్తిగా తీసుకొని ఉమ్మడి జిల్లాలో రైతన్నలు ఈ పండుగను ఘనంగా జరుపుకుంటారు.

పోటాపోటీగా అలంకరణ

ఎడ్ల పొలాల అమావాస్య వచ్చిందంటే చాలు వ్యవసాయం చేసే రైతులు తమ ఎద్దులను ముస్తాబు చేయడానికి పోటీపడుతారు. రెండు, మూడు రోజుల నుంచే పండుగ కోసం ఏర్పాట్లు చేసుకుంటారు. ఈ పండుగను పురస్కరించుకొని రైతులు ఉదయాన్నే సమీపంలోని చెరువులు, వాగుల్లోకి ఎద్దులను తీసుకెళ్లి వాటిని శుభ్రంగా కడుగుతారు. ఇండ్లకు తీసుకువచ్చి రకరకాల రంగులతో వాటిని అందంగా ముస్తాబు చేస్తారు. అనంతరం గ్రామాల్లోని ప్రధాన వీధుల గుండా ఎద్దులను ఊరేగింపుగా పంట చేనుల్లోకి తీసుకెళ్తారు.

చందూర్‌లో ఆలయం చుట్టూ ఎడ్లను తిప్పుతున్న రైతులు

ఎద్దులను అందంగా అలంకరిస్తాం.

వ్యవసాయ పనుల్లో మా కుటంబానికి ఆసరగా ఉంటున్న బసవన్నలంటే ఎంతో ఇష్టం. ప్రతి ఏడాది ఎడ్ల పొలాల అమావాస్య రోజున పండుగను ఘనంగా జరుపుకుంటాం. ఎడ్లను శుభ్రంగా కడిగి అందంగా అలంకరిస్తాం.

-రాములు, రైతు, మాధవపల్లి, గాంధారి మండలం

సంతోషంగా జరుపుకుంటాం



వ్యవసాయంలోని ప్రతి పనిలో సహాయపడుతున్న బసవన్నలకు పండుగను నిర్వహించడం సంతోషంగా ఉంటుంది. ఎడ్ల పొలాల అమాస్య రోజున ఉలువలు, బెబ్బర్లతో తయారు చేసిన గుడా లు, బెల్లం పాకాన్ని ఎద్దులకు తినిపిస్తాం.

-కొల్లూరి రాములు, రైతు, మాధవపల్లి,గాంధారి మండలం.

జానపద కళలకు నిలయం ఇందూరు

పురస్కారాన్ని అందుకుంటున్న కళాకారులు

సుభాష్‌నగర్, సెప్టెంబర్ 1: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు మహోన్నతమైనవని, తెలంగాణ ప్రాంతీయ జానపద కళలకు ఇందూరు నిలయమని నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్ అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో సంగీత్ కల్చరల్ అకాడమీ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మకరంద్ మాట్లాడుతూ అకాడమీ చేస్తున్న కృషిని అభినందించారు. పలు రంగాల్లో విశేష కృషిచేసిన కళాకారులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ సినీనటి ఎస్టర్ నోర్హోనా, డాక్టర్ వాణి, కాసర్ల శ్యాం, గైని గంగారాం, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, కల్చరల్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అష్ట గంగాధర్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, హరిప్రసాద్, క్రాంతి, రెంజర్ల రాజేశ్, సుజాత, తిరుపతిరెడ్డి, ప్రవీణ్, రచన, పురస్కార గ్రహీతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు పాడిన పాటలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

సిరిగాద ప్రసాద్‌కు కలం యోధ అవార్డు ..

కంఠేశ్వర్, సెప్టెంబర్ 1: సంగీత్ కల్చరల్ అకాడమీ వారు ఓ దినపత్రిక సంపాదకుడు సిరిగాద ప్రసాద్‌కు కలం యోధా అవార్డును ప్రదానం చేశారు. ఆయనకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

భార్యను కడతేర్చిన భర్త

వివరాలు వెల్లడించిన డిచ్‌పల్లి సీఐ మల్లేశ్

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 1: డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగస్టు 29న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన రాథోడ్ విజయ (32) అలియాస్ మీనాక్షిది హత్య అని సీఐ మల్లేశ్ తెలిపారు. డిచ్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. వెస్లీనగర్ తండాకు చెందిన గబ్బర్ సింగ్ సదాశివనగర్ మండలం యాచారం గ్రామానికి చెందిన విజయను 2016లో వివాహం చేసుకున్నాడని తెలిపారు. హైదరాబాద్‌లో ఉంటున్న వారు ఇటీవల డిచ్‌పల్లి స్టేషన్ లోని సాయినగర్ కాలనీకి వచ్చి ఉంటున్నారన్నారు. ఆగస్టు 29న విజయ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా.. ఆమె తల్లి గబ్బర్‌సింగ్‌పై అనుమానం వ్యక్తం చేసింది. దీంతో గబ్బర్‌సింగ్‌ను ఆగస్టు 31న అదుపులోకి తీసుకొని విచారించగా.. తానే విజయ మెడకు చున్నీ చుట్టి హత్య చేసినట్లు ఒప్పుకున్నాడని సీఐ తెలిపారు. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. కేసును ఛేదించిన ఎస్సైతో పాటు, సిబ్బందిని సీఐ అభినందించారు.

కల్లు లేక వ్యక్తి మృతి

రుద్రూర్, సెప్టెంబర్ 1: కల్లు లేక ఓ వ్యక్తి మృతి చెందాడని వర్ని పోలీసులు ఆదివారం తెలిపారు. సేవాలాల్ తండాలో ఉండే తన కూతురు నౌసిన్ బేగం వద్దకు హైదరాబాద్‌కు చెందిన చాంద్‌పాషా(48) వారం రోజుల క్రితం వచ్చాడు. కల్లు తాగే అలవాటు ఉన్న అతడు వారం రోజులుగా కల్లు లేకపోవడంతో వింతగా ప్రవర్తించాడు. ఇంట్లో నుంచి వెళ్లిన అతడు అఫందిపారం శివారులోని నిజాంసాగర్ డీ38 కెనాల్ వద్ద ఆదివారం శవమై కనిపించాడు. కల్లు, తిండి లేక మూర్ఛ వ్యాధితో మృతిచెంది ఉండొచ్చని నౌసిన్ బేగం ఫిర్యాదు చేసిందని ఎస్సై కృష్ణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

చెక్కుల పంపిణీ

చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ బాల్‌రాజ్

కోటగిరి/ పోతంగల్, సెప్టెంబర్ 1: కోటగిరి, పోతంగల్ మండలాలకు చెందిన పలువురికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం అందజేశారు. బాన్సువాడలోని పోచారం స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి ఆయన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోటగిరి మండల మాజీ జడ్పీటీసీ శంకర్‌పటేల్, నాయకుడు ఎజాస్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పోతంగల్ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, ఏఎంసీ చైర్మన్ హనుమంతు, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, షేక్ సజ్జాత్, గూడ్‌బాయ్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలను ముట్టుకోవొద్దు

కోటగిరి, సెప్టెంబర్ 1: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దని ఏఈ కృష్ణ ప్రజలకు సూచించారు. విద్యుత్ సరఫరా అయ్యే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వాగులో చెత్త తొలగింపు

చందూర్, సెప్టెంబర్ 1: చందూర్ వాగులో చేరిన చెత్తను ప్రజా ప్రతినిధులు జేసీబీ సహాయంతో ఆదివారం తొలగింపజేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో కాలువల ద్వారా వరద చేసి చెత్తాచెదారం బ్రిడ్జి వద్ద పేరుకుపోయింది. దీంతో జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్, సొసైటీ మాజీ చైర్మన్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిరుత దాడిలో రెండు గొర్రెలకు గాయాలు

సారంగాపూర్, సెప్టెంబర్ 1: నిజామాబాద్ మండలంలోని మల్కాపూర్(ఏ) గ్రామ శివారులో చిరుత దాడిలో రెండు గొర్రెలకు గాయాలయ్యాయి. తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు మందను మల్కాపూర్(ఏ) గ్రామ శివారులోకి తీసుకెళ్లారు. శనివారం సాయంత్రం చిరుత దాడి చేయడంతో రెండు గొర్రెలకు గాయాలయ్యాయి. దూరంగా ఉన్న యజమానులు గట్టిగా అరవడంతో చిరుత అక్కడి నుంచి పరారైంది. ఆగస్టు 15వ తేదీన ఇదే గ్రామ శివారులో చిరుత గొర్రెల మందపై దాడిచేసి ఒక గొర్రె మృతిచెందిన విషయం తెలిసిందే. 15 రోజుల వ్యవధిలో చిరుత రెండు సార్లు దాడి చేయడంతో గొర్రెల కాపరులు, గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ఇకనైనా ఫారెస్టు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 1: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం జరిగిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. పట్టాలపై దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. అతడి జేబులో బాన్సువాడ నుంచి నిజామాబాద్ ప్రయాణించిన బస్ టికెట్ ఉందని తెలిపారు. మృతుడి చేతిపై ఆర్ఆర్ఆర్ అనే పచ్చబొట్టు ఉన్నదన్నారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే ఎస్సై 8712658591నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

టీడీపీ సంబురాలు

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 1: ఆంధ్రప్రదేశ్ సీఎంగా చంద్రబాబు నాయుడు 1998 సెప్టెంబర్ ఒకటో తేదీన ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దేగాం యాదాగౌడ్, అంబిక సత్యనారాయణ, ఆనంద్, రాజు, నర్సయ్య, ఫిరోజ్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.